రంగయ్య

[కథానిక]

*

= శ్రీ పద్మరాజు =

కొత్త ఇంటికి గోడలు పూర్తిగా లేచాయి. దూలాలు సరిచేసి ఎక్కిస్తున్నారు. ఒక పక్క పెద్ద పందిరికింద పెద్దగొయ్యి తవ్వి కర్ర కోస్తున్నారు. కొంత మంది కూలివాళ్లు ఇటుకలు మోస్తున్నారు. కొంతమంది బొందడి మోస్తున్నారు.

ఇన్ని పనులమీద దృష్టినిలిపి చూడలేక సుబ్బారావుకి నీరసం వొస్తుంది. ఇంత మంది కూలివాళ్ళలో ఎవడు బద్ధకిస్తున్నాడో కనిపెట్టటం ఎంత కష్టం? ఒక కూలివాడు తట్ట కిందబెట్టి చెట్టుకి చేరబడి చుట్ట వెలిగిస్తాడు. సుబ్బారావుకి ఆ సమయంలో చాలా కోపం వస్తుంది. కాని అతను ఏదో అందామనుకునేసరికి కూలివాడు తట్ట తీసుకొని మళ్ళీ బయలుదేరుతాడు. తీరా తట్టతీసుకు నడుస్తుంటే వాడు పని చేస్తున్నట్టేగా? అంచేత సుబ్బారావు వాడిని ఏమీ అనలేక పోతాడు. కూలివాడుపైగా అతనివేపుచూచి చిరునవ్వునవ్వుతాడు.

సుబ్బారావుకి పదిహేను సంవత్సరాలు. మేనమామ గారి ఇంట్లోవుండి చదువుకుంటున్నాడు. అతని మేనమామపేరు రామశాస్త్రి. కట్టే కొత్త ఇల్లు రామశాస్త్రిది. అతను సుబ్బారావుని పిలిచి ఒకనాడు అన్నాడు:

"ఒరే సుబ్బన్నా! నువ్వు ఈ శెలవలకి ఇంటికి ఎందుకు పోవడం? నీకు సంగతులన్నీ బాగా తెలుస్తాయి. మన కొత్త ఇంటి దగ్గరకు పోయి కనిపెట్టి చూస్తుండు. ఇటువంటి వన్నీ నేర్చుకోవాలి. ఒరేయి, ఆకూలివాళ్లు దొంగవెధవలుసుమా! జాగ్రత్తగా కనిపెట్టి చూస్తుండాలి. బోలెడంత యినపసామాను, కర్ర ఉంది. ప్రతీరోజూ లెక్క వేస్తుండు సామాను. చెప్పడం మరిచిపోయాను. ఆ రంగయ్య వొట్టి బద్ధకస్తుకు. వాడిని పొడుస్తుండాలి."

కాని సుబ్బారావుకి రంగయ్యని చూస్తే అమిత భయం.

రంగయ్య ఎప్పుడోకాని పనిచెయ్యడు. ఊరికే చుట్ట కాలుస్తూ తిరుగుతుంటాడు. మెలి తిరిగిన మీసాలు, ఎర్రటి కొంటెకళ్లు—అతన్ని ఎవ్వరూ లొంగదీయలేరు. అతను తిరుగుతూ కబుర్లు చెప్పుతుంటాడు. పనివాళ్ళు విని నవ్వుకుంటారు. ఆ నవ్వకంలో కొంతసేపు పని ఆగిపోతుంది.

సుబ్బారావుకి పనిచేసినదానికంటే నవ్వడంలోనే ఎక్కువకాలం వినియోగపడుతున్నట్టు అనుమానం. అంచేత అతను ఒకనాడు ధైర్యంచేసి రంగయ్యదగ్గరకు వెళ్ళి సగం జంకుతూనే అన్నాడు:

"రంగయ్యా! నువ్వు బొత్తిగా పనిచెయ్యడం లేదు. మామయ్యతో చెపుతాను."

రంగయ్య విరగబడినవ్వాడు. పక్కని ఉన్న ఒక పెద్ద దూలంమీద కూర్చుని చుట్టనుసి రాల్చాడు.

"ఇలా రా పంతులూ! కూకో. నూశా! మేస్త్రీ అంటే ఏటనుకుంటన్నా? కూలోళ్ళకాత పని సేయించాలన్న మాట. ఇల్లా వొచ్చి కూకో. కాళ్లు లాగుతయి."

సుబ్బారావుకి లోపల చాలా అసహనంగా ఉందిగాని ఏమీ అనలేకపోయాడు. దూలంమీద కూర్చుని ఈ పని విషయంలో నిబంధన లేమిటోనని ఆలోచిస్తున్నాడు. రంగయ్య ఏదో చెపుతున్నాడు. కూలీలు వింటున్నారు సరదాగా.

రంగయ్య నలభయి సంవత్సరాల నల్లటి మనిషి. అతను పుట్టుకతోటే సోమరిగా పుట్టి వుంటాడు. కబుర్లలో అతన్ని కాదనగలవాడెవడూ అతనికి ఇంతవరకూ తగలలేదు. అతనికి పని అప్పగించేవారందరూ

అతన్ని ఎరుగుండే అప్పగిస్తారు. అతను పని చెయ్యడం లేదని ఎదురుగుండావచ్చి ఎవరూ అడగలేరు. అతను నిజానికి అంత మోటుమనిషీ కాడు. మాటకి మాట ఫెడేమని అంటాడు. అంచేత అతనంటే అందరికీ జంకు.

ఒకనాడు పొద్దున్న సుబ్బారావు పెద్ద గొడవ చేశాడు. మేకులబుట్టలో రెండు మర మేకుల పొట్లాలు పోయాయి. కూలీలంతా అతనిమీద జాలి దలిచినట్టు చుట్టూ చేరి చూస్తున్నారు. అతను ఏం చెయ్యడానికీ తోచని గొంతుకలో అంటున్నాడు:

"చెప్పండి, ఎవరు తీశారో. మా మామయ్యతో చెప్పుతాను లేకపోతే"

ఇంతలో రంగయ్య వచ్చాడు. "పొండర్రా పని లోకి. అల్లా నూతారేటి?...ఏం పంతులూ?"

"మర మేకుల పొట్లాలు రెండు పోయాయి."

రంగయ్య చుట్ట కొస పంటితో కొరుకుతూ అన్నాడు: "అం తేగందా. రెండేనా? పోతే పోనాయితే ...యెంకన్నగా రిల్లు కట్టేటప్పుడు దూలాలు దూలాలే పోనయి"

"మా మామయ్యతో చెపుతాను"

"చెప్పు......చెప్పేం లాబం?"

"ఎవరు తీశారో చెప్పడం లేదు"

"ఏం గాపకంవుంటదీ? నిన్న రేత్రి ఏ కల్లుపాక లోకో పోయుంటయి. ఎవడికి గుర్తుంటది?"

"అల్లా దొంగతనంగా పట్టుకుపోతే ఎల్లాగమరి?"

"తమ్ముడూ, నువ్వు దొంగతన మంటున్నావా? నిజంగా దొంగతనం కాదు. మీ మామ ఎంత దొంగో నీకు తెల్చా? వొడ్డీలమీదవొడ్డీలు కూడేసి ఎన్ని కొంపలు మట్టం చేశాడు మరి? పోనీ, ఈళ్ళకి రోజుకి రూపాయన్నా లేకపోతే తాగుడుకీ తిండికీ ఎల్లా సరిపోద్ది?"

"అందుకోసం దొంగతనం చేస్తారా?"

"పల్లీ దొంగతన మంటా వేంటి? నూశా! సంద లేల అలిసిపోయి దావతగా వుంటది. సేతులో మీ మామ దమ్మిడీ పెట్టడు. ఏదో సేతికొచ్చింది పట్టుకుపోకపోతే సత్తారా? నువ్వే చెప్పు. ఏమంటా?"

సుబ్బారావు మాట్లాడలేదు. ఇంత దొంగముండా వాడు ఈలోకంలో ఇంకొకడు ఉండ డనుకున్నాడు. కాని రంగయ్యనిచూస్తే అతనికి లోపల ఏదో ఆందోళన కలుగుతుంది.

"నూడు తమ్ముడూ! మీమామతో ఇట్టాంటి వన్నీ సెప్పి ఏం లాబం? పోయిన సరుకు ఎల్లాగా రాదు. పైగా ఎందుకు పోయిందని నిన్నే తంతాడు. మీమామ మంచోడు గాడు"

రంగయ్య లేచి కూలివాళ్ళని హెచ్చరించడానికి వెళ్ళాడు.

సుబ్బారావు "ఈ విషయాన్ని మేనమామకు చెప్పాలా? అక్కరలేదా" అని చాలాసేపు తర్కించుకున్నాడు. అతని మనసు ఏ నిశ్చయానికీ రాలేదు.

ఇల్లా రెండురోజులు గడిచిపోయింది. రెండు రోజులు గడిచిన తరువాత విషయం పాతబడిపోయింది. ఇప్పుడింక చెప్పడంలో అర్థంలేదని సుబ్బారావు మాట్టాడక ఊరుకున్నాడు.

ఆవేళ ఎండ తీవ్రంగా ఉంది. పని కొంచెం ఇంచుమించుగా సాగటం లేదు. గోడలమీద లేచిన వాసాలు ఇంటి అస్థిపంజరంలాగ ఉన్నాయి. సుబ్బారావు కునికిపాట్లు పడుతూ పెద్ద చింతచెట్టు కింద తాటాకు చాప పరుచుకుని పడుకున్నాడు. సగం మగతలో అనేక దృశ్యాలు అతని మనస్సులోనించి నడిచిపోతున్నాయి. ఈ కూలి పనివాళ్లు, వాళ్ళమీద ఈ రంగయ్య, మామయ్య, యిల్లు, దూలాలు, వాసాలు—ఇవన్నీ అతని మనస్సులో గాబరా చేస్తున్నాయి. ఇవన్నీ ఉన్న లోకంలో తనబోటి అమాయకులు నివసించడానికి వీలున్నట్టు అతనికి తోచలేదు.

రంగయ్యని ఏరకంగా అర్థంచేసుకోవాలో అతనికి ఎంత ఆలోచించినా తెగలేదు. అతన్ని చూసినప్పుడల్లా అతనికి మామయ్యగారింట్లో కోడెదూడ జ్ఞాపకం వస్తుంది. అది ఒక్కొక్కసారి అతను గోకితే అతని చేతిని నాకుతుంది. ఒక్కొక్కసారి గబుక్కుని గంతు వేసి ముఖం ఓరగాపెట్టి నానా అల్లరీ చేస్తుంది. ఒక్కొక్కసారి పొడవడానికి తల వంచుతుంది. అంచేత దాన్ని ఎల్లా బుజ్జగించాలో అతనికి తెలియడం లేదు. రంగయ్యకూడా అంతే.

ఆ కలత నిద్రలో అతనికి టపటపమని ధ్వని వినబడింది. మొదట బద్ధకించి ఇంకో పక్కకి తిరిగి కళ్లు మూశాడు. కాని టపటపశబ్దం మళ్లీ వినబడింది. ఈ సారి కొంచెం గట్టిగా వినబడింది. సుబ్బారావు లేచి కూర్చున్నాడు. అతనికి మొదట్లో ఏదో పెద్దజంతువు చుట్ట కాలుస్తున్నట్టు ఆకాశంలో పొగలు కనిస్తున్నాయి. పనివాళ్ళు పరుగెత్తుతున్నారు. పద్రంగులు దూలాలమీద నిలబడి చూస్తున్నారు.

ఒక వందగజాల అవతల ఇళ్లు అంటుకున్నాయి.

రంగయ్య గబగబ వచ్చాడు. గట్టిగా అరుస్తూ ఆజ్ఞాపించాడు :

"ఒరేయి, ఆ వాసాలు, గీసాలు ఊడపీకెయ్యండి. దూలాలుకూడా కిందకు తప్పించెయ్యండి"

"గాలి అటుందిరా. దీనికి పరవాలేదు" అన్నాడొక వడ్రంగి.

"ఊడపీకేత్తే ఇంకో నెల పని పెరుగుద్ది. ఎర్రి నాయాలా!...ఏమో ఎవరు సూడొచ్చారు? గాలి ఉన్నట్టుండి ఇటు తిరిగితే! ఇప్పెయ్యండి గబగబ."

సుబ్బారావుకి నోట మాట లేదు. అప్పుడే వడ్రంగులు వాసాలు పీకేస్తున్నారు. రంగయ్య కాలిన ఇళ్ళవేపు గబగబ పరిగెత్తాడు. సుబ్బారావు అతన్ని పిలుస్తూ అతని వెనకాలే వెళ్లాడు.

రెండు ఇళ్లు జంటగా కాలుతున్నాయి. ఇవతల ఇద్దరు మగవాళ్లు, ఇద్దరు ఆడవాళ్లూ నెత్తీ నోరూ మొత్తుకుని ఏడుస్తున్నారు. చాలామంది దూరంగా నిలబడి చోద్యం చూస్తున్నారు. కొంతమంది మాత్రం చంద్రుడికి ఒక నూలుపోగన్నట్టు ఒక బిందెకు బిందెడు నీళ్లు ఆ పెద్ద మంటల్లోకి చల్లుతున్నారు.

రంగయ్య నిలబడి చూశాడు. ఒక వెర్రి మొగంవాడు రంగయ్యదగ్గరకు వచ్చి అన్నాడు:

"ఇంట్లో నలుగురు పిల్లలూ, ఒక ముసిలీ ఉండిపోయారు. గుమ్మాలు అంటుకుపోనాయి. పాపం, ఆళ్లు ఏడుత్తున్నారు."

"ఏ గదిలో ఉన్నారు?"

ఏడుస్తున్న మగవాళ్లలో ఒకడు దీనంగా దగ్గరకు వచ్చి అన్నాడు:

"ఇద్దరు పిల్లలు దచ్చినంగదులో పండుకున్నారు. ఇద్దరు పిల్లలూ, ముసలమ్మా పడమటింట్లో ఉన్నారు. అయ్యమ్మో! కాలి మసయిపోతారు. నా తల్లులోయి. కుర్రోడు ఒక్కగాను ఒక్క కుర్రోడు బాబోయి...."

"నోరు మూసుకో. సిగ్గులేదూ. మొగోడివి!"

రంగయ్య తొడుక్కున్న బనీను విప్పాడు. ఇంతలో సుబ్బారావు అతని దగ్గరకు చేరుకున్నాడు. రంగయ్య బనీను అతనిచేతిలో పెట్టాడు. ఇంటి అరుగు దగ్గరకు వెళ్లి పరిశీలించి చూస్తున్నాడు. సుబ్బారావు కోపంగా అతన్ని సమీపించి అన్నాడు:

"ఇల్లంతా మళ్ళీ విప్పెయ్యమంటావా? మామయ్యతో చెపుతానుండు. అంతదూరాన్నుంది."

ఒక కాలినదూలం కింద పడబోయింది. రంగయ్య సుబ్బారావుని ఒక చేత్తో ఎత్తి అవతలకి విసిరాడు. తను ఒక్క గంతువేసి తప్పుకున్నాడు. దూలం పెద్దగా మండుతూ అరుగు మీద పడి కిందకి పడిపోయింది. రంగయ్య పక్కనున్న మనిషి తలకి చుట్టుకున్న తువ్వాలు పీకి గోచీపెట్టి పంచి సుబ్బారావుచేతికిచ్చాడు.

"మాట్టాడావంటే మక్క లిరుగుతాయి. కూడా కూడా తిరిగావా సత్తావు."

సుబ్బారావు మెదడు దిమ్మెక్కినమీదట జవాబు ఏమీ చెప్పలేదు. రంగయ్యని పెద్దకళ్లతో అమాయకంగా చూశాడు. రంగయ్య పెద్ద కొత్త వాసాలు రెండు తెప్పించాడు. రెండు చేతుల్లోనూ రెండు పట్టుకుని మండుతున్న ద్వారబంధం దగ్గరకు వెళ్లాడు. అరుగుమీద కప్పు ఇంకా కాలుతోంది. రెండు వాసాలను కింద కొసలకు ఆన్చి శక్తికొద్దీ కాలుతున్న ద్వారబంధాన్ని నెట్టాడు. సగం కాలిన కర్ర పట్టుతప్పి ద్వారబంధం దభేలుమని మండుతూ ముందుకు పడింది. రంగయ్య పట్టుతప్పి కొంచెం తూలాడు. మీద పడబోయే ద్వారబంధాన్ని చేతులో ఉన్న వాసంతో అరుగుకిందకి నెట్టాడు. పెద్ద మంట మండుతూ ద్వారబంధం కింద పడిపోయింది. రంగయ్య ఇంట్లో ప్రవేశించాడు. నిప్పువేడి తగలకుండా దూరంగా నిలబడి అందరూ చూస్తున్నారు. ఇంట్లో అంతా మంటలు, పొగ. అన్ని తలుపులూ అంటుకున్నాయి. రంగయ్య శరీరం ఉడుకుతోంది. ఊపిరి ఆడటంలేదు. తిన్నగా పొగ, మంటలమధ్యనించి పడమటి వసారాలోకి దూకాడు. భుజం కాలింది. చేత్తో కాలిన చోట రాసుకుంటూ ఇటూ అటూ వెదికాడు. ఇద్దరు పిల్లలు ముఖాలు పేవురించి కిందపడి ఇటూ అటూ దొర్లుతున్నారు. ముసిలి ఒక పక్కని గోడకి చేర్లబడి కొన వూపిరితో స్పృహ తప్పివుంది. ఇద్దరు పిల్లలూ అతన్ని చూశారు. కాని లేవలేకపోయారు. బయటికి రావడానికి మార్గంలేదు. గుమ్మం పెద్దగా మండుతోంది. సావడిలోంచి పోవాలంటే మంటల మధ్యనించి వెళ్లాలి. పిల్లలు తట్టుకోలేరు. కిటికీలోంచి అవతలికి చూశాడు. వసారా అవతల దొడ్డే. అయితే దొడ్డిలోకి దారి పక్క కొంజాలోంచి ఉంది. కొంజా పెద్దగా మండుతోంది. రంగయ్య కిటికీమీద పని ప్రారంభించాడు. కిటికీ ఇంకా అంటుకోలేదు. ఇనప

ఊసలు పాతవయినా గట్టిగా ఉన్నాయి. ఒక క్షణం పాటు అతనికి ఆలోచన పోలేదు. మంటపొగలు పక్క కొంజాలోంచి వసారాలోకి పాకుతున్నాయి. చటుక్కుని అతనికి ఆలోచన తట్టింది. చేతిలో వాసాల్ని చివర పట్టుకుని రెండోకొసలు కిటికీ ఊసలమధ్య తగిలించి దూరంగా నిలబడి శక్తికొద్దీ వంచాడు. ఊసలు కొంచెం వెంకితనంచేసి వొంగిపోయాయి. ఒక్కొక్క ఊసనీ రెండు చేతుల్లోనూ పట్టుకుని తన బరువంతా గోడకు తన్నిపట్టి లాగాడు. ఊసలు కమ్ముల్లోంచి ఊడిపోయాయి. ఆ ఊపుకి రంగయ్య వెనక్కి పడిపోయాడు. పైనించి దూలం కాలి పడబోతోంది. గబుక్కుని లేచి ఇద్దరు పిల్లల్నీ చెరొక చేత్తోనూ పట్టుకుని గోడపక్కకి లాగాడు. దూలం పడిపోయింది. మంట దగ్గరగా దేహాన్ని ఉడికిస్తోంది. కడుపులో అతనికి త్రిప్పు ప్రారంభమయింది. కళ్లు మూసుకుని ఇద్దరు పిల్లల్నీ కిటికీ దగ్గరగా తీసుకువచ్చి కిటికీలోంచి దొడ్డిలోకి దింపాడు. దొడ్డివేపు కొంతమంది జనం వచ్చి రంగయ్య ప్రయత్నాలన్నీ చూస్తున్నారు. వాళ్లు తొందరగా పిల్లల్ని అందుకున్నారు. రంగయ్య ముసలమ్మనిగూడా కిటికీలోంచి అందిచ్చాడు. అవతల్నించి ఎంతోమంది కేకలు వేశారు.

"నువ్వు కూడా దిగొచ్చెయ్య రంగయ్యా! ...సచ్చిపోతావు రంగయ్యా!... ఇంకొచ్చెయ్య!..." ఒకక్షణం కిటికీకి చేర్ల బడి నిలబడ్డాడు. అతనికి స్పృహ తప్పి మళ్ళీ వచ్చింది. అతని మనస్సులో ఏదో ప్రవేశించింది. కాలుతున్న ఇంట్లోకి నిర్లక్ష్యంగా నడిచి వెళ్లాడు. అందరూ సగం సందేహంతో, సగం భయంతో అతను కనిపించినంతవరకూ చూశారు.

సుబ్బారావు అందరినీ తప్పించుకొని ముందుకు వచ్చి చూశాడు. రంగయ్య ముసలమ్మని ఇవతలికి అందిచ్చి లోపలికి వెడుతున్నాడు. రంగయ్య ముఖంలో చావును జయించిన వెలుగేదో సుబ్బారావుకి కనిపించింది. నోరు తెరుచుకొని రంగయ్యముఖాన్ని జ్ఞాపకం చేసుకుంటూ నిలబడ్డాడు.

దక్షిణపు వేపు దొడ్డిలోనించి రంగయ్య గొంతుక వినబడింది. దొడ్డి గోడకి తలుపులేదు. నిచ్చెనవేసుకొని ఇద్దరు ఎక్కారు. దొడ్డిలో స్పృహతప్పిన ఇద్దరు పిల్లలూ, రంగయ్యా ఉన్నారు. సుబ్బారావు కూడా చటుకుని గోడ ఎక్కాడు. రంగయ్య మామూలు రంగయ్యలాగ లేడు. ముఖం మాడిపోయింది. రెండుమూడు చోట్ల చర్మం కాలిపోయింది. కళ్లు ఎర్రగా గొప్పగా వెలుగుతున్నాయి.

ఇద్దరు పిల్లల్నీ, రంగయ్యనీ ఇవతలికి చేర్చారు. సుబ్బారావు రంగయ్యని భక్తిగా చూశాడు. పిల్లల తల్లిదండ్రులు రంగయ్య రెండుచేతులూ పట్టుకుని సంతోషం, కృతజ్ఞతా వెలిబుచ్చుతూ ఏడ్చారు. రంగయ్య పచ్చికమీద వెల్లకిల పడుకున్నాడు. నలుగురయిదుగురు చుట్టూ చేరారు. తక్కినవాళ్లు చుట్టూ గుడికట్టి అతని ధైర్యస్థైర్యాలని పొగుడుకున్నారు.

"కల్లు రొండుముంతలు తేండ్రా!" అన్నాడు కళ్లుమూస్తూ రంగయ్య. సుబ్బారావు అతని తలయెత్తి అతని పంచి, బనీను లుంగచుట్టి తలగడకింద పెట్టి పక్కని కూర్చున్నాడు.

కల్లుతాగిన అరగంటదాకా రంగయ్యకి స్పృహ రాలేదు. తరవాత కళ్లు తెరిచాడు. వంటికంతకీ ఇద్దరు ఆముదం పట్టిస్తున్నారు. రంగయ్య సుబ్బారావుని చూశాడు. వెనకటి కొంటితనం అతని చూపుల్లో ప్రవేశించింది.

"ఏం పంతులూ, ఇల్లంతా ఇప్పేశారా?"

"నేను చూడలేదు."

"సూశావు పంతులూ! మనిసయిపుట్టినందుకు నలుగురికీ నాలుగురాళ్లొచ్చేటట్టు సూడాల. మీ మామ ఇల్లు పూర్తి అయిపోతే ఇంక మాకు పనేదీ? ఇప్పుడింకో రెండునెల్లు ఇంకా పనుంటది."

సుబ్బారావు దానికేమీ సమాధానం చెప్పలేదు. అతని వేపు ఒక క్షణం చూచి అన్నాడు:

"నువ్వు ముందూవెనకా చూసుకోకుండా అల్లా మండుతున్న ఇంట్లోకి వెళ్లిపోయావుగదా, వొళ్ళంతా కాలి చచ్చిపోతే?"

"సచ్చిపోతే రేపటికి రొండు" అంటూ రంగయ్య బాధతో కళ్లుమూస్తోనే పెదవులతో నవ్వాడు.